క్లుప్తంగా

బాల్యమిత్రుడికి ఆర్థికసాయం



హఫీజ్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న బాల్యమిత్రులు

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన ఎస్‌కె.హఫీజ్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో నడిగూడెంలోని శ్రీకొల్లు పాపయ్యచౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1983– 84 బ్యాచ్‌కు చెందిన అతని బాల్య మిత్రులు శనివారం హఫీజ్‌కు రూ.74 వేల ఆర్థికసాయం అందజేసి చేయూత నందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సందీప్, డాక్టర్ జంపాల శ్రీనివాస్, శ్రీనివాసచారి, ఎండీ.మౌలానా, భిక్షమాచారి, హరిశంకర్, గులాం, మాధవచారి పాల్గొన్నారు.

విద్యార్థులకు సకాలంలో బస్సు సౌకర్యం కల్పించాలి

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లి ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఆయా గ్రామాల విద్యార్థులకు సరైన సమయంలో బస్సు సౌకర్యం కల్పించి ఇబ్బందులు లేకుండా చూడాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు జోగు అరవిందరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గడ్డిపల్లిలోని పాఠశాలలకు దూపహాడ్, మర్రికుంట, పొనుగోడు, గరిడేపల్లి, కీతవారిగూడెం తదితర గ్రామాల నుంచి సుమారు 300 మంది విద్యార్థులు వస్తున్నారని బస్సులు సమయానికి రాకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

పీఏఐపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన

కోదాడ : పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ (పీఏఐ)పై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన ఉండాలని డీఎల్‌పీఓ నారాయణరెడ్డి అన్నారు. శనివారం మోతె మండల కేంద్రంలోని రైతు వేదికలో పంచాయతీ కార్యదర్శులకు పీఏఐపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో అభివృద్ధి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై కార్యదర్శులు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ నిర్మాణాన్ని ఆపాలని వినతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న తిలక్‌నగర్ వాసులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని తిలక్‌నగర్ పరిధిలో సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ స్థానికులు శనివారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సెల్ టవర్ నిర్మిస్తే దాని నుంచి వచ్చే రేడియేషన్ ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని అన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో కోలపూడి దయాకర్, దగ్గుపాటి బాబురావు, చంటి, శ్రీనాథ్, కళ్యాణ్, నరేష్, వసంత్, సత్యనారాయణ, ఉపేందర్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి నిత్యాన్నదాన సత్రం అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గల రెడ్డి నిత్యాన్నదాన సత్రం అభివృద్ధికి హుజూర్‌నగర్ మండలంలోని లక్కారం గ్రామానికి చెందిన కోనుగంటి వీరారెడ్డి జ్ఞాపకార్థం భార్య కమలమ్మ శనివారం రూ.50,116ను సత్రంలో కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో దాతల కుమారుడు వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ



అల్పాహారం పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : పట్టణంలో శనివారం నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు గుండ్రెడ్డి సైదిరెడ్డి మాట్లాడుతూ.. సరికొప్పుల నాగేశ్వర్‌రావు ఆర్థిక సహకారంతో అల్పాహారం పేదలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కొణతం సీతారాంరెడ్డి, బట్టు మధు, చల్లా ప్రభాకర్‌రెడ్డి, యూసుఫ్, సూరిబాబు, గుండా సత్యనారాయణ, పూర్ణచంద్రారెడ్డి, శ్రీను, ధనుంజయ నాయుడు, శావయ్య తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ సమస్యతో అవస్థలు



జాన్‌పహాడ్ వెళ్లే దారిలో తోపుడుబండ్లు, రోడ్డుపైనే పార్కింగ్ చేసిన వాహనాలు

- కోదాడ– జడ్చర్ల రహదారికి ఇరువైపులా ఆక్రమణ
- జాన్‌పహాడ్ రోడ్డుపై తోపుడు బండ్లు పెట్టి వ్యాపారాలు
- రహదారులపైనే వాహనాల పార్కింగ్
- రాకపోకలకు ఇబ్బందులు



నేరేడుచర్లలో కోదాడ- జడ్చర్ల రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు

నేరేడుచర్ల : పట్టణంలో కోదాడ– జడ్చర్ల జాతీయ రహదారి, జాన్‌పహాడ్ రోడ్డులో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడేళ్ల క్రితం నేరేడుచర్లలో జాతీయ రహదారి వెంట ఇరువైపులా 50 ఫీట్ల మేర రోడ్డును విస్తరించారు. అదే విధంగా జాన్‌పహాడ్ రోడ్డును ఇరువైపులా 33 ఫీట్ల మేర వెడల్పు చేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీలు నిర్మించారు. అయితే రోడ్డు వెంట దుకాణదారులు డ్రెయినేజీని ఆక్రమించుకొని దుకాణాల ముందు రేకులతో షెడ్డు వేసి సామగ్రి పెడుతుండడంతో పాదాచారులు రోడ్డుపైనే నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అంతేకాకుండా రోడ్డుకు ఇరువైపులా పండ్లు, కూరగాయల వ్యాపారం, తోపుడు బండ్లు పెట్టి వ్యాపారం చేస్తున్నారు. దుకాణాల్లో సామన్లు కొనుగోలు చేసేందుకు వచ్చే వినియోగదారులు రోడ్డుపైనే తమ కార్లు, బైక్‌లు, ఆటోలు నిలుపుతుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వాహనాలు రోడ్డుపైనే పెడుతున్నా పోలీస్ యంత్రాంగం మాత్రం నిద్రావస్థలోనే ఉందని స్థానికులు విమర్శిస్తున్నారు.

నిత్యం రద్దీగా ప్రధాన రహదారి..

నేరేడుచర్లలో ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో పాటు ఉద్యోగులు, వివిధ పనులను నిమిత్తం గ్రామాల నుంచి వచ్చే ప్రజలతో ప్రధాన రోడ్డు రద్దీగా ఉంటుంది. దీనికి తోడు రోడ్డుపైనే వాహనాలు నిలుపుతుండడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. జాన్‌పహాడ్ రోడ్డులో కొబ్బరిబొండాలు, పండ్ల వ్యాపారులు రోడ్డుపైనే దుకాణాలు ఏర్పాటు చేయడంతో భారీ వాహనాలు వచ్చినప్పుడు ఆ వాహనాలు తిరగలేక వాహనాలు, పాదాచారులను ఢీకొడుతున్నాయి. గతంలో జాన్‌పహాడ్ రోడ్డు మూలమలుపులో లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ప్రమాదాలు జరిగినప్పుడే పోలీసులు వచ్చి హడావుడి చేసి రోడ్డుపై ఉన్న వ్యాపారస్తుల బండ్లను పక్కకు తొలగిస్తున్నారని, మిగితా రోజుల్లో కన్నెత్తి కూడా చూడటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, పోలీసులు రోడ్లపై పెట్టే తోపుడు బండ్లు, వ్యాపారులపై చర్యలు తీసుకొని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని పట్టణ, మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలి



జడ్చర్ల– కోదాడ జాతీయ రహదారి, జాన్‌పహాడ్ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. రోడ్లపైనే వాహనాలు, తోపుడు బండ్లు ఉంచుతున్నారు. దీంతో రోడ్లు ఇరుకుగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి. పోలీసులు, అధికారులు స్పందించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలి.

– టి. నగేష్, నేరేడుచర్ల

ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తాం



నేరేడుచర్లలో ప్రధాన రహదారి, జాన్‌పహాడ్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేకంగా కానిస్టేబుల్‌ను నియమించి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. రోడ్డును ఆక్రమించి ఇరువైపులా తోపుడు బండ్లు పెట్టకుండా చూస్తాం.

– రవీందర్‌నాయక్ ఎస్‌ఐ, నేరేడుచర్ల

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- జూనియర్ సివిల్ జడ్జి సయ్యద్ ఉమర్



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి సయ్యద్ ఉమర్

కోదాడరూరల్ : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోదాడ కోర్టు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి సయ్యద్ ఉమర్ అన్నారు. శనివారం కోదాడ పట్టణంలోని రేస్ ఐఐటీ, మెడికల్ బాలికల ఇంటర్ కళాశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకుంటే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. కళాశాల వయస్సులో విద్యార్థులు ఎలాంటి తప్పటడుగులు వేసినా జీవితం అంధకారమయ్యే ప్రమాదం ఉందని అన్నారు. ర్యాగింగ్, మాదకద్రవ్యాల వినియోగం, ఫోక్సో చట్టాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో రేస్ విద్యా సంస్థల చైర్మన్ బాణాల వసంత వెంకటరెడ్డి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఉయ్యాల నర్సయ్య, గట్ల నర్సింహారావు, సీతారామరాజు, చలం, శ్రీధర్, జానీపాషా, శరత్‌కుమార్, మల్లికార్జున్, ప్రిన్సిపాల్ సిరికొండ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బ్లాస్టింగ్‌తో భారీ శబ్దం.. ఉలిక్కిపడ్డ కీతవారిగూడెం



కీతవారిగూడెం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ నరేష్

గరిడేపల్లి : మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామ సమీపంలో గల శ్రీనివాస స్టోన్ క్రషర్ మిల్లులో శనివారం రాత్రి బ్లాస్టింగ్ చేపట్టడంతో వచ్చిన భారీ శబ్దంతో కీతవారిగూడెం గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. బ్లాసింగ్ శబ్దాలు రావడం అక్కడి ప్రజలకు సాధారణమే అయినా శనివారం భారీ శబ్దం రావడంతో కీతవారిగూడెం ప్రజలతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. బ్లాస్టింగ్‌తో వచ్చిన పెనుశబ్ధంతో గ్రామంలోని రేకుల ఇళ్లు, షెడ్లు కంపించడం, ఇళ్లలోని వస్తువులు కిందపడడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. అంతేకాకుండా కొంతసేపు దుర్వాసన రావడంతో ఊపిరి పీల్చుకోవడానికి అసౌకర్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ చలికంటి నరేష్ సిబ్బందితో కీతవారిగూడెం చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. ఘటనపై విచారణ జరిపారు.

‘ప్రభుత్వ’ విద్యార్థులకు చేయూత



హుజూర్‌నగర్ : విద్యార్థులకు బూట్లు, టై అందజేస్తున్న ఎంఈఓ సైదానాయక్, నాగరాజు



కోదాడ : విద్యార్థులకు టై, బెల్టులు, ఐడీ కార్డులు అందజేస్తున్న ఎంఈఓ గోపాల్‌రావు

హుజూర్‌నగర్ : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు సహకరించాలని ఎంఈఓ సైదానాయక్ కోరారు. శనివారం మండలంలోని బూరుగడ్డ ప్రాథమిక పాఠశాలలో దాత యరగాని నాగరాజు విద్యార్థులకు టై, బెల్టులు, బ్యాడ్జీలు, షూస్, సాక్సులు అందజేశారు. ఉపాధ్యాయురాలు రేణుక 45 రోజుల గణితం యాక్షన్ ప్లాన్ వర్క్ షీట్లను అందజేశారు. ఆర్.శాంత విద్యార్థులకు జాలి ఫోనిక్స్ రెండు వర్క్ పుస్తకాలు, ఉపాధ్యాయులకు ఐడెంటిటీ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత ప్రమాణాలు కలిగిన విద్య అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం ఎన్.శ్రీనివాసరెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ వెంకటరమణ, హెచ్‌ఎం ఎస్.పద్మ, ఉపాధ్యాయులు బాబు, రేణుక, శాంత, సుదాశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బెల్టులు, ఐడీ కార్డుల పంపిణీ

కోదాడ : మోతె మండలంలోని కూడలి గ్రామంలో గల ఎంపీయూపీఎస్‌లో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులకు టై, బెల్టులు, ఐడీ కార్డులను మండల విద్యాధికారి కె.గోపాల్‌రావు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు బుద్ధిగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థులకు టై, బెల్టులు, ఐడీ కార్డులు అందించిన ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.వీరన్న, ఉపాధ్యాయులు ఎల్ దేవానందం, ఆర్.నాగయ్య, పి.వీరారెడ్డి, సైదులు పాల్గొన్నారు.

వర్షపు నీటిలో నిల్చొని నిరసన



నిరసన తెలుపుతున్న ప్రజలు

కోదాడరూరల్ : మండల పరిధిలోని నల్లబండగూడెంలో గల పీర్ల సావిడి వీధిలో నిలిచిన వర్షపు నీటిలో నిల్చొని ఆ ప్రాంత ప్రజలు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీర్ల సావిడి వీధిలో వర్షపు నీరు పారే దారి లేక నిలుస్తోందని, దీంతో దుర్గంధం వెదజల్లుతోందని, దోమలు వ్యాప్తి చెందుతున్నాయని తెలిపారు. అధికారులు స్పందించి వీధిలో నీరు నిల్వకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

స్పెషల్ బీఈడీ అభ్యర్థులకు న్యాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్

మునగాల : ఉద్యోగ నియామకాల్లో స్పెషల్ బీఈడీ అభ్యర్థులకు న్యాయం చేయాలని భారత వికలాంగుల హక్కుల పోరాట సమితి (బీవీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని తిమ్మారెడ్డిగూడెంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 2024లో చేపట్టిన డీఎస్సీ నియామకాల్లో ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల కోసం బోధించే స్పెషల్ బీఈడీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం ధిక్కరించి జనరల్ డీఎస్సీ తరహాలోనే స్పెషల్ డీఎస్సీ అభ్యర్థులకు కూడా 30 శాతం రిక్రూట్‌మెంట్, 70 శాతం ప్రమోషన్లు చేపట్టేలా జీఓ నంబర్ 97ను తీసుకువచ్చి స్పెషల్ బీఈడీ అభ్యర్థుల జీవితాలతో చెలగాటమాడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పింఛన్లను రూ.ఆరువేలకు పెంచి ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను గుర్తించి భర్తీ చేయాలని కోరారు. వికలాంగులకు రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో బీవీహెచ్‌పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు గోపిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరి ఈదయ్య బాబు, సంఘం విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు వాకుడోతు లాల్‌సింగ్, డి.కృష్ణ కిషోర్, దుస్సా సతీష్, గజ్వేల్లి రమేష్, లక్ష్మణ్, బక్కయ్య, జగన్, బ్రహ్మయ్య, లక్ష్మణ్, కేశవ్, శ్రీశైలం పాల్గొన్నారు.

విద్యావేత్త ప్రభాకర్‌రెడ్డి మృతి బాధాకరం

హుజూర్‌నగర్ : పేద పిల్లలకు విద్యనందించిన విద్యావేత్త, ప్రైవేటు పాఠశాల అధినేత పటేల్ ప్రభాకర్ రెడ్డి మృతి బాధాకరమని పలువురు నాయకులు అన్నారు. శనివారం పట్టణంలో ఆయన మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో పట్టణ ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సత్యమయ్య మృతి తీరని లోటు



మంకెన సత్యమయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిలుకూరు : చిలుకూరుకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మంకెన సత్యమయ్య మృతి పార్టీకి తీరని లోటని టీపీసీసీ డెలిగేట్ లక్ష్మీనారాయణరెడ్డి, గ్రంథాలయం సంస్థ జిల్లా చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. శనివారం చిలుకూరులో నిర్వహించిన సత్యమయ్య సంతాప సభలో వారు మాట్లాడారు. సత్యమయ్య కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొలిశెట్టి నాగేంద్రబాబు, బండ్ల కోటయ్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, పార్టీ చిలుకూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కీత వెంకటేశ్వర్లు, పార్టీ వర్కింగ్ మండల అధ్యక్షుడు యడవెల్లి పుల్లారావు, పిండ్రాతి హనుమంతరావు, కీసర సంతోష్‌రెడ్డి, సొందు మియా, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్

నేరేడుచర్ల : వర్షాకాలం దృష్ట్యా ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి సూచించారు. శనివారం నేరేడుచర్ల మున్సిపాలిటీలో వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 9వ వార్డులో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. మున్సిపల్ సిబ్బంది, వార్డు ఆఫీసర్లు ఉన్నారు.

బ్లూ కలర్ డే



బ్లూకలర్ దుస్తుల్లో చిన్నారులు, ఉపాధ్యాయులు

కోదాడ : పట్టణంలోని తేజ పాఠశాలలో శనివారం బ్లూ కలర్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బ్లూ కలర్ వస్త్రాలు ధరించడంతో పాటు వివిధ రకాల బ్లూ కలర్ వస్తువులను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. చిన్నారులు రంగులను శాశ్వతంగా, సులువుగా గుర్తుంచుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు.

ముఖ గుర్తింపు ద్వారా పింఛన్లు

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి : చేయూత పింఛన్లను ముఖ గుర్తింపు ద్వారా పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల నుంచి బయోమెట్రిక్ విధానానికి స్వస్తి పలికి మొబైల్ యాప్ ద్వారా లబ్ధిదారుల ముఖ గుర్తింపు విధానంతో లబ్ధిదారులకు పింఛన్ అందజేయనున్నట్లు తెలిపారు. అన్ని శాఖలు సమన్వయం చేసుకుంటూ వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మొక్కలను నాటడంతోపాటు వాటికి నీరు పోసి కాపాడాలని తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయాలని, సీజనల్ వ్యాధులు రాకుండా దోమలు ఉన్న చోట, నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేయాలని, దోమల మందు స్ప్రే చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ వీవీ అప్పారావు, డీపీఓ యాదగిరి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష, డీఎల్‌పీఓ నారాయణ రెడ్డి, పోస్టల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు : ఆర్డీఓ



అనంతగిరిలో నూతన రేషన్ కార్డులు అందజేస్తున్న ఆర్డీఓ సూర్యనారాయణ

అనంతగిరి : అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందుతాయని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేసి మాట్లాడారు. మండలంలో 675 మంది లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు అందజేసినట్లు తెలిపారు. రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని తెలిపారు. అర్హులు నూతన రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కే. హిమబిందు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్, ఆర్‌ఐ వెంకట నగేష్, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి, బుర్ర పుల్లారెడ్డి, జొన్నలగడ్డ కోటేశ్వరరావు, కొండపల్లి వాసు, మాజీ ఎంపీపీ చుండూరి వెంకటేశ్వరరావు, షేక్ నాగుల్‌మీరా, సింగారెడ్డి కిరణ్‌రెడ్డి, ఈదుల కృష్ణయ్య, మాజీ జెడ్పీటీసీ కొణతం ఉమాశ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించాలి



మోతె పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కోటి రత్నం

మోతె : ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, ప్రోగ్రాం ఆఫీసర్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కోటి రత్నం అన్నారు. శనివారం మోతె మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండేలా ఆరోగ్య సిబ్బంది చూడాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా మండలంలో టీకాల పంపిణీపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మ, డేటా ఎంట్రి ఆపరేటర్ జ్యోతి, ఫార్మసిస్టు విజయశ్రీ, స్టాఫ్ నర్సులు శ్రీదేవి, సుకన్య, ఎల్‌టీ నిర్మల, ఆయాస్ కవిత, తదితరులు పాల్గొన్నారు.

సాగర్ కాల్వ కట్టపై కంపచెట్ల తొలగింపు



కృష్ణానగర్ సమీపంలో సాగర్ ఎడమ కాల్వకట్టపై కంపచెట్లు తొలగిస్తున్న దృశ్యం

నడిగూడెం : నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కట్టలు అధ్వానంగా మారాయి. కాల్వల కట్టలపై ఇరువైపులా కంపచెట్లు దట్టంగా పెరిగాయి. దీంతో సాక్షి దిన పత్రికలో పలుమార్లు కథనాలు ప్రచురితం కావడంతో ప్రభుత్వం స్పందించి కట్టలపై కంపచెట్ల తొలగింపునకు రూ.18 లక్షలు మంజూరు చేసింది. దీంతో కృష్ణానగర్ డీప్‌కట్ 155.30 కిలో మీటర్ నుంచి రామాపురం, చాకిరాల, సిరిపురం, కాగితరామచంద్రాపురం రంగుల వంతెన 133 కిలో మీటర్ వరకు కాల్వ కట్టలకు ఇరువైపులా ఉన్న కంపచెట్లు తొలగించే పనులు చేపడుతున్నారు. గత మూడు రోజులుగా పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 15 రోజుల్లో పనులు పూర్తి చేస్తామని ఏఈ సరిత తెలిపారు.

పాఠశాలల్లో కార్గిల్ విజయ్ దివస్




హుజూర్‌నగర్ : కార్యక్రమంలో పాల్గొన్న ఆర్మీ కమాండర్ భరత్ భూషణ్, హెచ్‌ఎం, ఎస్‌ఓ

హుజూర్‌నగర్ : నాయకత్వం అనేది ఒక గురుతర బాధ్యత అని ఆర్మీ కమాండర్ భరత్ భూషణ్ అన్నారు. శనివారం పట్టణంలోని పెరల్స్ ఇన్ఫినిటీ ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ విద్యా సంవత్సరానికి గాను విద్యార్థులకు అధికారికంగా నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తూ బ్యాడ్జీలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించాలని అన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం మురుగన్ పిళ్లే, ఎస్‌ఓ ప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్గిల్ వీరులకు ఘన నివాళి

కోదాడ : దేశం కోసం పోరాడిన సైనికుల వీరత్వాన్ని దేశం ఎప్పటికీ మరువదని, వారి త్యాగాలను సదా స్మరించుకుంటుందని తేజ పాఠశాల నిర్వాహకుడు జానకి రామయ్య అన్నారు. శనివారం కోదాడలోని తేజ పాఠశాలలో కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్ అమరవీరులకు నివాళులర్పించి మాట్లాడారు. అనంతరం విద్యార్థులు జాతీయ జెండాలతో ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో సోమ్లానాయక్, సంతోష్‌కుమార్, రామ్మూర్తి, నవ్య, రాంబాబు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు విస్మరించిన ప్రభుత్వాలు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి

నడిగూడెం : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి ఆరోపించారు. శనివారం నడిగూడెం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం మండల స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. మతతత్వ శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. లౌకిక ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. కేంద్రంలో ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అనేక మంది లౌకిక మేధావులను, అభ్యుదయ వాదులను హత్యకు గురవుతున్నారని ఆరోపించారు. అనంతరం సిరిపురం, వేణుగోపాలపురం, గ్రామాలకు చెందిన పలువురు సీపీఎంలో చేరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు రాములు, వీరాంజనేయులు, హనుమయ్య, కిషోర్, వెంకన్న, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మట్టపల్లిలో నారసింహుని నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లిలో శ్రీలక్ష్మీనరసింహస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, పంచామృతాభిషేకం, నిర్వహించారు. శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అనంతరం విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణం జరిపారు. శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రవేశం అనంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్ కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

పీవైఎల్ కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలి

సూర్యాపేట అర్బన్ : హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో ఆదివారం జరిగే ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు కట్ట రమేష్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు పిడమర్తి అర్జున్, బయ్యా గణేష్, పాల్వాయి ప్రవీణ్, గోగుల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.